


కట్టా రాంబాబు

# పెళ్ళిచూపులు

రాజబాబు పెళ్ళిచూపులకెళ్ళేది ఈరోజే.

అతని ఆనందం అంతా ఇంతా కాదు. మనసు ఎగిరెగిరి పడుతోంది. ఎప్పుడెప్పుడు చూస్తానా అని తొందర పెడుతోంది.

అమ్మాయి ఫోటో చూసిన వెంటనే అతనికి మతిపోయింది.

ఇంత అందమైన అమ్మాయిని తనకి ప్రపోజ్ చేయడం తన అదృష్టంగా భావించాడు.

అమ్మాయి ఏదో ఛానల్లో కొంత కాలం యాంకర్‌గా పనిచేసి మానేసింది. ఆమె యాంకరింగ్ చేస్తున్నప్పుడు చాలాసార్లు చూసాడు. ఇలాంటి అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే బాగుండుననుకున్నాడే గానీ నిజంగా ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

పెళ్ళిచూపులు కాకుండానే పెళ్ళయినంత ఆనందంగా వున్నాడేమిటనే అంతా అనుకోవచ్చు. పేరుకి పెళ్ళిచూపులే తప్ప దాదాపు పెళ్ళి ఖాయమైపోయినట్లే.

రాజబాబు అమ్మా నాన్నా కూడా అమ్మాయిని చాలాసార్లు టీవీలో చూసారు. కుందనపు బొమ్మలా వుందని వాళ్ళమ్మ ఆ అమ్మాయిని చాలాసార్లు పొగిడింది. వాళ్ళ నాన్నకయితే ఆ అమ్మాయి మరీ నచ్చింది. సలక్షణంగా వుంది ఈ అమ్మాయినే చేసుకోరా అని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసారు. వాళ్ళకి రాజబాబు కాకుండా కూతురు కూడా వుంది. ఆమెకు రెండేళ్ళ క్రితమే పెళ్ళిచేసారు. రాజబాబు నాన్నగారు సెక్రటేరియట్‌లో పెద్ద ఉద్యోగమే చేస్తున్నారు. మంచి జీతం. సొంత యిల్లు వుంది. ఆస్తిపాస్తులకు లోటు లేదు.

రాజబాబు బీటెక్ పూర్తిచేసి ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అందంగానే వుంటాడు. అందుకే అమ్మాయి తరఫువాళ్ళు ఈ సంబంధానికి వప్పేసుకున్నారు. ఇంక లాంఛనంగా పెళ్ళిచూపులు జరుపుకుని తాంబూలాలు పుచ్చుకోవడమే.

ఉదయంనుంచీ రాజబాబు హుషారుగా వున్నాడు. అమ్మాయి ఫోటోను జేబులో పెట్టుకునే తిరుగుతున్నాడు. ప్రతీ పది నిముషాలకు ఓసారి ఫోటోతీసి చూసుకుంటున్నాడు. టీవీలో చూసిన దానికంటే చాలా బాగుంది. చక్రాల్లాంటి కళ్ళు, అందమైన ముక్కు, సన్నని పెదాలు, ఓహ్! వర్ణించడానికి భాష రావడం లేదు.

రాజబాబు ఫ్రెండ్స్ కూడా ఒకటే పొగడటం భలే ఛాన్స్ కొట్టావురా అని. తన అదృష్టానికి తెగ మురిసిపోతున్నాడు రాజబాబు.

పెళ్ళిచూపులకని రాత్రి వైజాగ్‌లో బయలుదేరిన అక్కాబావల్ని రిసీవ్ చేసుకోవడానికని రైల్వేస్టేషనుకెళ్ళాడు రాజబాబు. ఆత్రం ఆగని అక్క రాజబాబుని దార్లోనే అడిగేసింది "అమ్మాయిని టీవీలో చూడటమేనా మధ్యలో ఎప్పుడైనా బయట చూసావా" అని.

"లేదక్కా! ఈమధ్య టీవీలో కూడా కనపడటం లేదు. మానేసి ఆర్నెల్లయిందట. మొన్న మధ్యవర్తి ఫోటోల్ని తెచ్చిచ్చాడు అవి చూడటమే" అన్నాడు.

ఆ ఫోటోని చూసిన అక్కాబావలు కూడా అమ్మాయి అందాన్ని తెగపొగిడారు.

పదిగంటలకల్లా అంతా తయారై పెళ్ళిచూపులకు బయలుదేరారు. వీళ్ళుండేది దిల్‌షుక్‌నగర్లో. అమ్మాయివాళ్ళుండేది అమీర్‌పేటలో. వెళ్ళేది సొంత కారులో. అయినప్పటికీ ట్రాఫిక్‌వల్ల గంట పైనే పట్టేటట్లున్నది. కారు రాజబాబే డ్రైవ్ చేస్తున్నాడు. హైదరాబాదు వీధులు బాగా తెలిసిన వాడు కావడంతో సందులు, గొందుల్లోనుంచి కారుని పోనిచ్చి పదకొండు గంటలకల్లా అమ్మాయి వాళ్ళింటికి చేరుకున్నారు.


కారులోనుంచి రాజబాబు అమ్మానాన్న, అక్కాబావలు మొత్తం అయిదుగురు దిగారు. వీళ్ళని సాదరంగా ఆహ్వానించారు అమ్మాయి తల్లిదండ్రులు.

ఇల్లు చూసేసరికి అందరికీ అర్థమైపోయింది వీళ్ళు చాలా ధనవంతులని. ఒక్కతే అమ్మాయి కాబట్టి ఈ సంబంధాన్ని ఎలాగైనా ఖాయం చేసుకోవాలనుకున్నారు రాజబాబు తల్లిదండ్రులు. అంతా హాల్లో కూర్చున్నారు. హాల్లో వున్న ఫర్నిచరే లక్షల ఖరీదు చేస్తుంది. అమ్మాయి తండ్రి సిటీలో పెద్ద బిల్డరు. బాగానే సంపాదించాడు.

"మా అమ్మాయిని బి.యస్సీ వరకే చదివించామండి. తర్వాత తనకి చదవడం యిష్టం లేదంది. మేమూ బలవంతం చేయలేదు. చదివి ఉద్యోగం చెయ్యాలా ఏమిటి. ఉన్నది ఒక్కగానొక్క కూతురు. ఈ ఆస్తంతా దానిదే. చదువైపోయిన వెంటనే పెళ్ళి చేద్దామంటే ఒప్పుకోలేదు. ఓ సంవత్సరం వరకు చేసుకోనంది. సరే అన్నాం. ఈలోగా టీవీలో యాంకరింగ్ అవకాశమొస్తే చేరతానంది. తనిష్టాన్ని ఎందుకు కాదనాలని ఒప్పుకున్నాం. ఓ ఆర్నెల్లు చేసి మానేసింది. అప్పట్నించీ మంచి సంబంధం కోసం వెతుకుతున్నాం. ఇప్పటికి మీ సంబంధం దొరికింది. మధ్యవర్తి మీ గురించి చెప్పిన వెంటనే మేమో నిర్ణయానికొచ్చేసాం. మీ సంబంధం సెటిల్ చేసుకోవాలని" అన్నారు అమ్మాయి తండ్రి.

ఇంతలో టిఫిన్లు వచ్చాయి. అమ్మాయిని చూడకుండా తినకూడదని అనుకున్నారుగాని వాళ్ళు బలవంతం చేయడంతో తినక తప్పలేదు.

రాజబాబుకి అక్కడ ముళ్ళమీద కూర్చున్నట్లుంది. ఎప్పుడెప్పుడు అమ్మాయిని తీసుకొస్తారా, చూసిన వెంటనే పర్సనల్‌గా ఆ అమ్మాయితో



వాళ్లాడతానా అని తొందరపడుతున్నాడు. అనుకున్న సమయం రానే వచ్చింది.

అమ్మాయిని తీసుకుని వచ్చింది తల్లి.

అమ్మాయిని చూసిన అందరికీ మూర్ఛపోయినంత పనయింది. అమ్మాయికి బంగారపురంగు పట్టుచీర కట్టారు. మెళ్ళో డైమండ్ సెట్, చెవులకు మేచింగు డైమండ్ రింగులు, బంగారం ఒడ్డాణం, ఒక్కో చేతికి డజనుకుపైగా డైమండ్ గాజులు తొడిగారు. అమ్మాయి కూడా బంగారం రంగులోనే వుందేమో అచ్చంగా పోతపోసిన బంగారుబొమ్మలా వుందా అమ్మాయి.

ఆ అమ్మాయి రంగుని, వేసుకున్న బంగారాన్ని చూసి అంతా మూర్ఛపోయారనుకుంటే పప్పులో కాలేసినట్లే.

ఆ అమ్మాయి ఆకారాన్ని చూసి వాళ్ళంతా బిత్తరపోయారు. రాజబాబుకయితే ఈవీవీగారి 'కితకితలు' సినిమాలో నరేష్ పెళ్ళిచూపుల సీను గుర్తుకొచ్చింది. అమ్మాయి గీతాసింగ్ కంటే లావుగా వుంది. ఆ అమ్మాయి నడిచి వస్తుంటే ఓ చిన్నపర్వతమే కదిలి వస్తున్నట్లుగా వుంది. అమ్మాయిని ఎదురుగా వున్న కుర్చీలో కూర్చోపెట్టారు. ఆమె రాజబాబు వంకచూసి చిరునవ్వు నవ్వి తలవంచుకుని కూర్చుంది. మామూలుగా అయితే ఆ నవ్వుకి రాజబాబు ఫ్లాట్ అయిపోయేవాడే కానీ యిప్పుడు పిచ్చివాడిలా బిత్తరచూపులు చూస్తున్నాడు. మిగతా వాళ్ళింకా తేరుకోలేదు.

అందరికీ అర్థంకాని విషయమొక్కటే. ఫోటోలో చూస్తే సన్నగా మెరుపుతీగలా వుంది. ఇప్పుడు చూస్తే గజలక్ష్మిలా వుంది. ఆమె, ఈమె ఒక్కరేనా?

"ఈ అమ్మాయి.." అడిగింది రాజబాబు అక్క.

"మా అమ్మాయే. అదేంటి అలా అడుగుతున్నారు. మా యింటికి పెళ్ళిచూపులకని పిలిచి మా అమ్మాయిని కాకుండా వేరేవాళ్ళ అమ్మాయిని చూపిస్తామా" అంటూ గలగలా నవ్వాడు అమ్మాయి తండ్రి.

"అహా..అలా అని కాదు.." అంటూ నసిగిందామె.


"సరే మనం కట్నకానుకలు, యితర విషయాలు తర్వాత మాట్లాడుకుందాం" అని చెప్పి అమ్మాయిని లోపలికెళ్ళమన్నారాయన. అమ్మాయి నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళింది. ఇంకక్కడ అమ్మాయి తల్లీతండ్రి - వీళ్ళు అయిదుగురు వున్నారు. కాస్సేపక్కడ మౌనం తాండవించింది.

అప్పుడు రాజబాబు నాన్నగారు అందుకున్నారు. "చూడండి! మీరు మాకు పంపిన

ఫోటోలో అమ్మాయి ఎలా వుందో మీకు తెలుసు. మేం టీవీలో యాంకర్‌గా చూసినప్పుడు కూడా అమ్మాయి అలాగే వుంది. మీరిప్పుడేమో ఈ లావుపాటి అమ్మాయిని చూపించి ఈ అమ్మాయే మా అమ్మాయి అంటున్నారు. సరే ఫోటోలో వున్న అమ్మాయి ముఖం, ఈ అమ్మాయి ముఖం యించుమించు ఒకేలా వున్నాయనుకోండి. కానీ ఈ ఆర్నెలల్లో యింత లావెలా అయిపో యిందో మాకర్ధం కావడం లేదు"

"ఆ దిక్కుమాలిన టీవీ యాంక రింగ్ వల్లే యిలా తగలడిందండి" అంది దిగులుగా అమ్మాయి తల్లి.

"అదేంటండి టీవీ యాంకర్లంతా రోజురో జుకి అందంగా నాజూగ్గా తయారవుతుంటే మీ అమ్మాయి ఇలా లావయ్యిందేంటి. మీరు చెప్పేది నమ్మశక్యంగా లేదు" అంది రాజబాబు తల్లి.




"అదంతా మా ఖర్మండి. అసలేం జరిగిందో చెపుతాను వినండి. ఒక్కతే కూతురు కావడంతో ఎంతో గారాబంగా పెంచాం. చిన్నప్పట్నించీ ఆడింది ఆటగా, పాడింది పాటగా పెరిగింది. డిగ్రీ అయింతర్వాత పి.జి.చెయ్యమంటే చదువు మానేసి టీవీల్లో యాంకరింగ్ యిష్టమని అందులో చేరింది. మిగతా యాంకర్ల లాగా పనీ పాటా లేని ప్రోగ్రాముల్లో పాల్గొన్నా బాగుండేది. అలా కాకుండా అన్ని ఛానల్స్‌లోను వంటా వార్పూ కార్యక్రమాలు నిర్వహించేది. 'మీ యింటి కొచ్చి మేం వంట చేస్తాం', 'మీ వూళ్ళో మా వంట', 'మీరు వంట చెయ్యండి మేం తింటాం' లాంటి కార్యక్రమాలు యిప్పుడు అన్ని ఛానల్స్ లోను వస్తున్నాయి కదా. అవన్నీ యిదే నిర్వహిం చేది. ఆ ప్రోగ్రామ్స్ అయ్యాక యింటికొచ్చి సరిగ్గా అన్నం తినేది కాదు. సన్నబడటానికి డైటింగ్ చేస్తుందేమో అనుకున్నాం గానీ యిలా కొంప ముంచుతుందనుకోలేదు" అంటూ నెత్తిబాదుకుందామె.

"ఏం జరిగిందండి" అంది కంగా రుగా రాజబాబు అక్క.

"ఏం జరగటమేమిటండి..ఆ ప్రోగ్రాంలో వంట చేసినామె రుచి చూడమని యిస్తే కొంచెం నోట్లో పెట్టు కుని "వావ్! ఎంత బాగుందో" అని మన యాంకర్లు వంకర్లు తిరుగుతారు చూడండి అది నిజమనుకున్నాంగానీ యిలా తయారయ్యాకగాని తెలియ లేదు ఆ ప్రోగ్రామ్ అయ్యాక చేసిన వంట బాగుందని యింకా అంతా తినేసేదని. ఈ ఆర్నెలల్లోను అన్ని ఛానల్స్‌లోను తెగ తిని ఎలా తయారవ్వాలో అలా తయారయ్యింది చూసా రుగా" అంటూ నిట్టూర్చిందావిడ.

అందరికీ మతిపోయింది. ఇప్పుడు చక్రాల్లా కళ్ళు తిప్పుతూ వంటా వార్పు యాంకరింగ్‌లు చేసే అమ్మాయి భవిష్యత్తులో ఎలా తయారవు తారో తలుచుకుంటుంటే అందరికీ వాళ్ళమీద జాలి కలిగింది.

రాజబాబుకి ఏం అర్ధం కావడం లేదు. ఏం చెయ్యాలి? ఏం చెప్పాలి? అమ్మాయి ఒకప్పుడు అందగత్తె. బాగా దబ్బుంది. చూస్తూ చూస్తూ ఎలా చేసుకోవాలి. బుర్ర పనిచెయ్యడం మానేసింది రాజబాబుకి.

○



## సమీరా నమ్మకం

తను స్వతహాగా దక్షిణాదికి చెందిన అమ్మాయి కాబట్టి తనకి ఇక్కడే మంచి ఆదరణ లభించడం ఎంతో సంతోషంగా వుందంటోంది రాజమండ్రి అమ్మాయి సమీరారెడ్డి. ఆమెకి తమిళనాట ప్రస్తుతం మంచి ఆద రణే వుంది. బాలీవుడ్‌లో మాత్రం అంతగా అవకా శాలు లేవు గానీ, నగేష్ కుకునూర్ (తెలుగువాడే) దర్శ కత్వం వహిస్తున్న 'ఏ హౌస్లా' హిందీ చిత్రం మాత్రం తనకి ఎంతో పేరు తెస్తుందని బోల్డంత నమ్మకంతో వుంది సమీరారెడ్డి. ఆమె నమ్మకం ఏమవుతుందో చూడాలి మరి!